# అంతా సామిదే!



# నేనెవర్ని ఇవ్వడానికి?

తెల్లవారితే వినాయక చవితి.

పొద్దు పొడవకముందే వూరి జనమంతా గుళ్ళోకొచ్చి పడ్డారు పత్రి కోసుకోవటానికి. తెల్లవారుజామున మూడు గంటలకే వచ్చిన ధరణికోట జనం కూడా అందులో వున్నారు.

"తలుపులు తియ్యండో" అని గోల.

కొందరు ప్రాకారం గోడలమీదకెక్కి వాటిమీంచి మారేడు చెట్లు ఎక్కి పత్రి కోయటం మొదలెట్టారు.

తలుపులు తీయటమేమిటి "హో" అని జన సముద్రం గుళ్లోకొచ్చి పడ్డది. మారేడుచెట్లు, గన్నేరు చెట్లు సరసర ఎక్కి పత్రి, ఆకులు దూసేస్తున్నారు. మారేడుకాయలు గుత్తులు గుత్తులుగా తెంపుతున్నారు. పిల్లలు ఓ చెట్టునించి మరో చెట్టుకు పాకిపోతూ ముళ్ళు గుచ్చుకుంటున్నా లెక్కచేయక దళాలు కోస్తున్నారు. ప్రాకారమంతా మారేడుదళాల సుగంధం, గన్నేరు పువ్వుల పరిమళం.

పదేళ్ళ సాంబడికి పట్టలేనంత సంబరంగా ఉంది. క్రిందటి సంవత్సరం

వినాయకచవితికి యజమానికి ఇంట్లో వినాయకపూజ జరుగుతుంటే గుమ్మంలో నుంచుని చూశాడు. వాళ్ళంతా పట్టుబట్టలు కట్టుకుని దేవుడికి పూజచేస్తూ హారతి ఇస్తుంటే తనకీ పూజ చేసుకోవాలనిపించింది. ఎలా? వినాయకుడు లేడు. పూలు లేవు. పత్రిలేదు. అందుకని సరాసరి గుళ్ళోకి పరుగెత్తికొచ్చి ఎవరూ చూడకుండా గుళ్ళో వినాయకుడి పాదాలమీద రెండు పూలు స్వయంగా పెట్టి మొక్కి వెళ్లిపోయాడు. ఈ సంవత్సరం ఎలాగైనాసరే తన గుడిసెలో వినాయకుడికి పూజ చేసుకోవాలని నిశ్చయించుకుని తెల్లవారు జామునే స్నానంచేసి వచ్చి పత్రి, పూలు కోస్తున్నాడు.

'కొమ్మలు విరవకండ్రా' అని ఎవరో పిల్లల్ని అదిలిస్తున్నారు.

తెల్లవారేసరికి సాంబడు చాలా పత్రి కోశాడు. జమ్మి ఆకులు, గన్నేరు మొగ్గలతో వొడి నింపుకున్నాడు, వొడి చాలకపోతే పరుగెత్తుకు ఇంటికివెళ్ళి పత్రంతా ఇంట్లో పీటమీద పోసి మళ్ళీవచ్చి పున్నాగపూలు కోసుకున్నాడు.

తెల్లవారేసరికి చెట్లన్నీ ఖాళీ అయిపోయాయి. ఒక్క ఆకు మిగల లేదు. ఒక్క పువ్వు మిగలలేదు. అన్ని పూలు స్వామి సేవకోసం వెళ్ళిపోతే చెట్లు బోసి పోతున్నాయి. జనం తగ్గిపోయారు. కొందరు గడ్డి వెతుక్కుంటూ గరిక, చంద్రకాంతపూలు, రేగు ఆకులూ ఏరుకుంటుంటే వాళ్ళవెంటే ఉండి సాంబడు కూడా ఆ పూలన్నీ సేకరించాడు.

పత్రి సంపాదించటమైతే అయింది. మరి వినాయకుడో? బజారుకు పరుగెత్తుకెళ్ళి మట్టి వినాయకుణ్ణి చేసి అమ్మేచోట ఎదురుగా కూర్చున్నాడు, జనం వరసగా వినాయకుడి బొమ్మలని కొనుక్కెళుతుంటే మళ్ళీ అచ్చుపోసి క్రొత్తవి తయారుచేస్తున్నాడు రంగయ్య. ఎదురుగా కూర్చున్న సాంబడితో "కాస్త సాయం చేయరా నీకో పావలా డబ్బులిస్తాను" అన్నాడు రంగయ్య. దాంతో సాంబడు పనిలోకి దూకాడు. మట్టి పిసికాడు. తనూ అచ్చులు పోశాడు. కళ్ళు దిద్దాడు. ఎందరెందరో వినాయకులు తన చేతిమీంచి పూజకి వెళ్ళిపోతుంటే పొంగిపోయాడు. పదకొండు గంటలైంది. రంగయ్యకి బేరం కూడా తగ్గిపోయింది.

'ఇదిగోరా నీ పావలా' అని డబ్బివ్వబోయాడు రంగయ్య. 'డబ్బులొద్దు నాకో వినాయకుణ్ణివ్వండి' అన్నాడు సాంబడు. 'ఓరి భడవా' అంటూ రంగయ్య ఓ పెద్ద వినాయకుణ్ణి చేసి ఇచ్చాడు. సాంబడి కళ్ళు సంతోషంతో వెలిగాయి! ఆ వినాయకుడితో పరుగు పరుగున ఇంటికొచ్చి కృష్ణకెళ్ళి మళ్ళీ తలస్నానం చేసి వచ్చి పీటమీద ముగ్గులేసి వినాయకుడి పూజకు కూర్చున్నాడు. పూజ ఎలా చేయాలో తెలిసింది కాదు. ఏ పత్రి ముందుంచాలో అంతకంటే అర్థమవలేదు.

యజమాని ఇంట్లో మంత్రాలు వినిపిస్తున్నాయి. వాటినాధారం చేసుకుని తనూ పూజ మొదలెట్టాడు. 'అగరొత్తులు వెలిగించండి' అని వినిపిస్తే ఉత్తుత్తి అగరొత్తి వెలిగించేవాడు. 'గన్నేరు పూలు పూజ చేయండి' అంటే ఆ పూలతో పూజ.

ఇలా పూజ సాగిపోయింది. పూజ ఆఖరున "కుడుములు, పాయసాలు, పళ్ళు, ఫలహారాలు నైవేద్యం పెట్టండి" అని విన్పించింది.

సాంబడికి నివేదన పెట్టడానికి ఏమీలేదు. కళ్ళనీళ్ళు తిరిగాయి. ఎదురుగా పెద్దవినాయకుడు. పత్రిలో మునిగిపోయి "నాకు నివేదన పెట్టవా?" అని చూస్తున్నట్టనిపించింది. తల్లి యజమాని యింట్లో గిన్నెలు అవీ కడిగిగాని రాదు. కుండల్లో ఏదన్నా ఉందేమో అని వెతికి చూశాడు. ఖాళీ. "దేవుడికి ఏం పెట్టాలి?" అని గిలగిల్లాడిపోయాడు. దేవుడికి ఆకలేస్తున్నట్లనిపించింది సాంబడికి. ఏంచేయాలో తోచక వెక్కి వెక్కి ఏడ్చాడు. ఏడ్చి ఏడ్చి వినాయకుడి పాదాల దగ్గిర పత్రిలో తలపెట్టుకుని పడుకొన్నాడు.

కొంతసేపటికి తల్లి గుడిసెలోకి వస్తూ "సాంబా" అని పిలిస్తే ఉలిక్కిపడి లేచాడు. "ఇదిగో వినాయకుడి పెసాదం" అని యజమాని ఇంట్లో ఇచ్చిన వడపప్పు సాంబడిచేతిలో పెట్టింది.

సాంబడి ముఖం విచ్చుకుంది. దేవుడికి పెట్టడానికి ఏదో దొరికింది. వినాయకుడి దగ్గరకి పరుగెత్తుకెళ్ళి "నీ నైవేద్దానికి దొరికింది సామీ!" అంటూ ఆ వడపప్పు వినాయకుడికి తినిపించాడు. చూస్తున్న తల్లి అంది. "పిచ్చి నాన్నా! సామి పెసాదం సామికే పెడ్తన్నావా?" అని. *